క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

హుడాకాంప్లెక్స్: 11కేవీ పెద్దఅంబర్‌పేట, లక్ష్మారెడ్డిపాలెం ఫీడర్ల పరిధిలోని కాలనీలలో మరమ్మతుల కారణంగా పలు ప్రాంతాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నామని సరూర్‌నగర్ డివిజనల్ ఇంజినీర్ రామకృష్ణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 7 నుంచి 11 గంటల వరకు 11కేవీ రాక్‌హిల్స్, వీ-గార్డ్, శ్రీనివాసకాలనీ, సాయినగర్, గౌటీటీ ఫంక్షన్‌హాల్ ఫీడర్ల పరిధిలో పలు ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి 9.30 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు. వినియోగదారులు సిబ్బందికి సహకరించాలని కోరారు.

మీర్‌పేట సీఐకి సన్మానం



సీఐను సత్కరిస్తున్న బీజేపీ నాయకులు

మీర్‌పేట: మీర్‌పేట పోలీస్‌స్టేషన్ నూతన ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన కిరణ్‌కుమార్‌ను మీర్‌పేట కార్పొరేషన్ బీజేపీ అధ్యక్షుడు, స్థానిక కార్పొరేటర్ భిక్షపతిచారి ఆధ్వర్యంలో గురువారం ఘనంగా సన్మానించారు. శాంతిభద్రతల పరిరక్షణకు తమవంతు సహకారం ఉంటుందని ఈ సందర్భంగా వారు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు సోమేశ్వర్, కార్పొరేటర్లు హరినాథ్‌రెడ్డి, భీంరాజ్, నర్సింహ, విక్కీసాగర్, శ్రీనివాస్‌రెడ్డి, శ్యాంసుందర్, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

జెడ్పీ చైర్‌పర్సన్ పరామర్శ



లలితమ్మ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న అనితారెడ్డి తదితరులు

కందుకూరు: మండల పరిధిలోని తిమ్మాపూర్‌కు చెందిన బీఆర్ఎస్ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డి తల్లి లలితమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. కాగా గురువారం జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి తిమ్మాపూర్‌కు వెళ్లి లలితమ్మ చిత్రపటానికి నివాళులర్పించారు. లక్ష్మీనర్సింహారెడ్డిని, ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. మాజీ ఎంపీటీసీ ఈశ్వర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన బొడ్రాయి ప్రతిష్ఠాపన ఉత్సవాలు



ప్రత్యేక అలంకరణలో బొడ్రాయి

తుక్కుగూడ: మున్సిపాలిటీ పరిధిలోని ఇమామ్‌గూడ(లక్ష్మీనగర్)లో నాలుగు రోజుల నుంచి నిర్వహిస్తున్న బొడ్రాయి (నాభిశిల) ప్రతిష్ఠాపన ఉత్సవాలు గురువారంతో ముగిసాయి. చివరి రోజున నాభిశిలకు పలురకాల అభిషేకాలు నిర్వహించటంతో పాటు ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు తీర్థ ప్రసాదాలను అందేశారు. పూజారులు, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నేడు 'డయల్ యువర్ డీఎం'

ఇబ్రహీంపట్నం: ఆర్టీసీ సర్వీసుల్లో నెలకొన్న సమస్యలను నేరుగా తెలుసుకునేందుకు శుక్రవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఇబ్రహీంపట్నం ఆర్టీసీ డిపో మేనేజర్ అశోక్‌రాజు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి 4 గంటల వరకు కార్యక్రమం ఉంటుందని, ఆర్టీసీ సర్వీసుల్లో సమస్యలను సెల్ నంబర్ 9959226141కు ఫోన్ చేసి తెలపాలన్నారు.

దెబ్బతిన్న రోడ్ల పరిశీలన



మంతన్‌గౌరెల్లి - మాల్ మార్గంలో రోడ్డును పరిశీలిస్తున్న శ్రీహరి తదితరులు

యాచారం: మండలంలో దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతులు చేయనున్నట్లు రోడ్లు భవనాల శాఖ ఏఈ శ్రీహరి తెలిపారు. గురువారం ఆయన మండలంలోని మంతన్‌గౌరెల్లి - మాల్ గ్రామాల మధ్య గుంతలు పడిన రోడ్డును పరిశీలించారు. త్వరలో టెండర్లు పిలిచి ఈ రోడ్డుకు మరమ్మతులు చేపడతామని తెలిపారు. గుంతల కారణంగా తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని ప్రయాణికులు ఏఈకి తెలిపారు.

తారెత్తిస్తున్న ఎండలు

- జిల్లాలో 38 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదు
- ఎండ వేడిమికి బయటికి రావాలంటే జంకుతున్న ప్రజలు
- జాగ్రత్తలు తీసుకోవాలంటున్న వైద్య నిపుణులు



ఎండ తీవ్రతకు గొడుగులతో యువతులు

హుడాకాంప్లెక్స్: రోజురోజుకు పెరుగుతున్న ఎండ తీవ్రతతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. జిల్లాలో గురువారం పగటి ఉష్ణోగ్రత 38 డిగ్రీలు దాటింది. వేసవి తాపానికి శరీరంలో సోడియం లెవల్స్ పడిపోతున్నాయి. ఎండ తీవ్రత దృష్ట్యా ఉదయం 9గంటల తర్వాత అవసరమైతే తప్ప బయటికి వెళ్లవద్దని వైద్యులు సూచిస్తున్నారు. తప్పనిసరైతే గొడుగు, తాగేందుకు మంచినీరు వెంటతీసుకెళ్లాలని.. వాహనదారులు హెల్మెట్, క్యాప్ వంటివి ధరించాలని సూచిస్తున్నారు.

జాగ్రత్తలు పాటించాలి..

చిన్నారుల శరీరంలో 50 శాతం నీరే ఉంటుంది. ఎండ వేడిమికి వారి శరీరంలో నీటిశాతం తగ్గడంతో వడదెబ్బకు గురవుతారు. దీంతో తలనొప్పి, వాంతులు, విరేచనాలు వంటి సమస్యలు రావొచ్చు. వేసవి సెలవుల కారణంగా ఆటపాటలు ఎక్కువవ్వడం సహజం. దీనికి ఎండ తోడవడం వల్ల విపరీతమైన అలసటకు గురవుతారు. నీరు ఎక్కువగా ఉండే పుచ్చకాయ, స్ట్రాబెర్రీ వంటివి అందించాలి. ఆమ్లేట్‌కు బదులు ఉడకబెట్టిన గుడ్డు, కోల్డ్ మిల్క్ వంటివి ఇవ్వాలి.

చెమటపొక్కులకు ఇలా చెక్..

చెమట పొక్కుల్ని గోళ్లతో గిల్లడం వంటివి చేస్తే ఇన్‌ఫెక్షన్ వచ్చే అవకాశం ఉంది. యాంటీ బ్యాక్టీరియల్ సోప్‌తో వీటిని శుభ్రం చేసుకోవాలి. గాఢమైన రంగులున్న దుస్తులు కాకుండా తేలికైన తెల్లని కాటన్ దుస్తులు ధరించాలి. వదులైన పలుచని దుస్తులు వేసుకోవాలి. ఉదయం, సాయంత్రం వేళల్లో చల్లటి నీటితో స్నానం చేయాలి. ఇంటి తలుపులు, కిటికీలకు గోనె సంచులను అమర్చి వాటిని నీటితో తడపాలి. టూవీలర్‌పై ప్రయాణించే వారు ముఖానికి రుమాలు చుట్టుకోవడం ఉత్తమం. ఎండలు కళ్లపై తీవ్ర ప్రభావం చూపుతాయి. డీహైడ్రేషన్ వల్ల కళ్లు ఎర్రబడి, మంట పుట్టిస్తాయి. వైద్యుడి సూచన మేరకు కళ్లకు ఎలాంటి హాని చేయని కూలింగ్ గ్లాసులు పెట్టుకోవాలి.

ఎండు ఉసిరితో గర్భిణులకు మేలు..

మూడోనెల వరకు గర్భిణులకు వాంతులు అవుతుంటాయి. ఉదయం 8 తర్వాత గర్భిణులు, బాలింతలు బయటికి వెళ్లాల్సివస్తే తగిన జాగ్రత్తలు తప్పనిసరి. నీరు తక్కువ తీసుకుంటే త్వరగా డీహైడ్రేషన్‌కు గురయ్యే ప్రమాదం ఉంది. ఎండిన ఉసిరి ముక్కను నోట్లో ఉంచుకుంటే కొంతవరకు ఈ బాధ నుంచి ఊరట పొందవచ్చు. రోడ్ల వెంట దొరికే ఐస్‌క్రీంలు, ఫ్రిజ్ వాటర్ తాగొద్దు. శుభ్రమైన ఫిల్టర్ నీటిని తాగాలి.

డీహైడ్రేషన్ నుంచి కాపాడుకోవాలి



వేసవిలో ఎండవేడిమికి శరీరంలో పొటాషియం, సోడియం లెవల్స్ పడిపోవడంతో వడదెబ్బకు గురవుతారు. రోజుకు కనీసం 5 నుంచి 6 లీటర్ల నీరు తాగాలి. ఎక్కువ నీరు తీసుకోవడం వల్ల డీహైడ్రేషన్ నుంచి కాపాడుకోవచ్చు. అతిగా కూల్‌డ్రింక్స్ తాగడం మంచిది కాదు. కొబ్బరినీళ్లు, నిమ్మరసం, పుదీనారసం, మజ్జిగ, పుచ్చకాయ రసం వంటివి తీసుకోవచ్చు. ఇక మామిడి, సపోట, బత్తాయి వంటి పండ్లు పోషకాలపరంగా ఉత్తమమైనవి. పిల్లలను ఎండలో ఎక్కువసేపు ఆడనీయొద్దు. ఓఆర్ఎస్ జ్యూస్ తీసుకోవాలి. జూన్ 12వ తేదీ వరకు ఎండల తీవ్రత తగ్గే అవకాశం ఉంది.

– డాక్టర్ ఏపీ చారి, ప్రముఖ వైద్య నిపుణుడు, సరూర్‌నగర్

దేవతలగుట్టపై 'స్వేరోస్ విక్టరీ డే' సంబురాలు

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని బాలాపూర్‌లో గురువారం స్వేరోస్ విక్టరీ డే సంబురాలు జరుపుకున్నారు. డా.ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ సహకారంతో ప్రపంచంలో అత్యంత ఎత్తైన ఎవరెస్ట్ శిఖరాన్ని అధిరోహించి గురుకుల పాఠశాల విద్యార్థులు మలావత్ పూర్ణ, సాదనపల్లి ఆనంద్‌కుమార్ దేశంతో పాటు తెలంగాణ రాష్ట్రానికి పేరు తీసుకువచ్చారు. మే 25, 2014ను గుర్తుకుచేసుకుంటూ బాలాపూర్‌లోని స్వేరో సర్కిల్ చిన్నారులు ఈ ప్రాంతంలో ఎత్తైన దేవతలగుట్టను ఎక్కి మలావత్‌పూర్ణ, ఆనంద్‌కుమార్ సాధించిన ఘనతపై హర్షం వ్యక్తం చేశారు. విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులు అశోక్‌కుమార్, ప్రుథ్వీరాజ్ పాల్గొన్నారు.



స్వేరోస్ జెండాలతో చిన్నారులు, ఉపాధ్యాయులు

ఎక్కడపడితే అక్కడ చెత్త వేయొద్దు



పారిశుధ్య పనులను పర్యవేక్షిస్తున్న మేయర్ పారిజాత

బడంగ్‌పేట మేయర్ పారిజాత

బడంగ్‌పేట్: కార్పొరేషన్ ఆధ్వర్యంలో మున్సిపాలిటీలోని పలు డివిజన్లలో గురువారం స్వచ్ఛ సర్వేక్షణ్‌పై స్పెషల్ డ్రైవ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని మేయర్ చిగురింత పారిజాత పరిశీలించారు. రోడ్లకు ఇరువైపులా ఉన్న చెట్లను జంగిల్ కటింగ్ చేయించారు. కాలనీల్లోని రోడ్లపై ఉన్న గుంతలు పూడ్చివేయించారు. లీకేజీ లున్న డ్రై నేజీలకు మరమ్మతులను చేయించారు. 22, 28 డివిజన్లో పేరుకుపోయిన చెత్తను తొలగించారు. మేయర్ మాట్లాడుతూ.. ఎక్కడపడితే అక్కడ చెత్తను వేయవద్దని కాలనీవాసులకు సూచించారు. స్వచ్ఛ ఆటోలు ఇంటింటికి, కాలనీలకు చెత్త సేకరణకు వస్తున్నాయని అందులో వేయాలని సూచించారు. డ్రైనేజీలు ఎక్కడైన నిండుకున్నా స్థానిక కార్పొరేటర్‌కు తెలియచేస్తే సిబ్బంది వచ్చి క్లీన్ చేస్తారని అన్నారు. ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు సూర్లగంటి అర్జున్, లిక్కి మమత, శానిటేషన్ ఇన్స్‌పెక్టర్ వంకాయల యాదగిరి, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చేరండి

ప్రిన్సిపాల్ రాధిక



అడ్మిషన్ బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న అధ్యాపకులు

బడంగ్‌పేట్: బడంగ్‌పేటలో ఉన్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల అడ్మిషన్ (2023–24) బ్రోచర్‌ను గురువారం కళాశాల అభివృద్ధి కమిటీ మెంబర్ పెద్దబావి ఆనంద్‌రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ డా.ఎస్. రాధిక, అధ్యాపకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బడంగ్‌పేటలోని డిగ్రీ కళాశాలలో అన్ని వసతులు ఉన్నాయని అన్నారు. పీహెచ్‌డీ అర్హత కలిగిన బోధనా సిబ్బందితో పాటు చక్కని ల్యాబ్ వసతి అందుబాటులో ఉందని అన్నారు. కాలేజీకి చేరుకోడానికి అన్ని రూట్లనుంచి బస్ సౌకర్యం ఉందని అన్నారు. ఇంటర్ పూర్తి అయిన విద్యార్థులు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అడ్మిషన్ తీసుకుని బంగారు భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలన్నారు. ప్రైవేట్, కార్పొరేట్ కాలేజీల్లో చేరి ఆర్థికంగా నష్టపోవద్దని పేద, మధ్యతరగతి కుటుంబాల విద్యార్థుల తల్లితండ్రులకు సూచించారు. ఇక్కడ అడ్మిషన్‌తో పాటు అన్ని సేవలు ఉచితంగా లభిస్తాయన్నారు. బ్రోచర్ విడుదల చేసిన వారిలో వైస్ ప్రిన్సిపాల్ బి.అనిల్‌కుమార్, అధ్యాపకులు చందోజీరావు, డా.కరీముల్లా, డా.విజయ్‌కుమార్, నరసింహరాజు, సిబ్బంది ఆనంద్, కృష్ణకుమారి పాల్గొన్నారు.

పీపుల్స్ మార్చ్ సభకు కాంగ్రెస్ శ్రేణులు



కడ్తాల్ నుంచి పీపుల్స్ మార్చ్ సభకు వెళ్తున్న కాంగ్రెస్ నాయకులు

కడ్తాల్: సీఎల్పీ నేత భట్టి విక్రమార్క చేపట్టిన పీపుల్స్ మార్చ్ పాదయాత్రలో భాగంగా గురువారం మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్లలో నిర్వహించిన బహిరంగ సభకు మండల కేంద్రం నుంచి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివెళ్లారు. అంతకుముందు పార్టీ నాయకులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం పలు వాహనాలలో జడ్చర్ల తరలివెళ్లారు. జడ్చర్లకు వెళ్లిన వారిలో డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, మాజీ జెడ్పీటీసీ శ్రీపాలి శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు కృష్ణ, భీమా, బలరాం, దశరథ్, రమేశ్, రాజు ఉన్నారు.

పార్కుల సమగ్రాభివృద్ధికి కృషి



బోరు పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ సుజాతానాయక్

హస్తినాపురం: డివిజన్ పరిధిలోని అన్ని ప్రాంతాల్లో ఉన్న పార్కులను అన్ని విధాల అభివృద్ధి చేస్తామని హస్తినాపురం డివిజన్ కార్పొరేటర్ బానోతు సుజాతా నాయక్ అన్నారు. డివిజన్ పరిధిలోని దత్తానగర్ కాలనీలోని పార్కు అభివృద్ధిలో భాగంగా బోరు వేసే పనులను కార్పొరేటర్ సుజాతానాయక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని పలు కాలనీల్లో ఉన్న పార్కుల అభివృద్ధి కోసం ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి ముందు చూపుతో నిధులను మంజూరు చేయించి పనులు చేయిస్తున్నారన్నారు. దత్తానగర్ కాలనీలో ఏర్పాటు చేసే పార్కు పనులకు హైదరాబాద్ మెట్రో డెవలప్‌మెంట్ అథారిటీ వారిచే ఎమ్మెల్యే రూ. 85 లక్షలు మంజూరు చేయించారన్నారు. కార్యక్రమంలో ఏఈ జీవన్‌రెడ్డి, దత్తానగర్ కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు గోపాల్, అభిషేక్, కనకదుర్గ, ఎల్లయ్య, బీఆర్ఎస్ నాయకులు గోపిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, పద్మిని, ఆదిలక్ష్మి, రోహిత్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఇంటి నిర్మాణానికి చేయూత

తలకొండపల్లి: మండలంలోని చంద్రధన గ్రామానికి చెందిన కుమ్మరి ఆంజనేయులు ఇటీవల ఇంటి నిర్మాణం చేపట్టాడు. అయితే ఆర్థిక ఇబ్బందులు కారణంగా పనులు ఆపేశాడు. ఉప సర్పంచ్ సుధాకర్ సహకారంతో జెడ్పీటీసీని కలిసి ఆర్థిక సహాయం చేయాలని కోరారు. స్పందించిన ఆయన ఉప్పల ట్రస్టు సభ్యులతో ఆంజనేయులు ఇంటి నిర్మాణానికి సిమెంట్, స్టీల్, ఇసుక తదితర సామగ్రిని గురువారం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ సుధాకర్, నాయకులు రాజేందర్‌రెడ్డి, బచ్చయ్యగౌడ్, గిరి, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

17శాతం లోపు తేమ ఉంటేనే ధాన్యం కొనుగోళ్లు

పీఏసీఎస్ చైర్మన్ చంద్రశేఖర్

కందుకూరు: కొనుగోలు కేంద్రానికి వరి ధాన్యాన్ని తాలు, చెత్త లేకుండా నాణ్యతా ప్రమాణాల మేరకే తీసుకురావాలని పీఏసీఎస్ చైర్మన్ చంద్రశేఖర్ గురువారం ఒక ప్రకటనలో రైతులను కోరారు. అధికారులు కేటాయించిన ఆమన్‌గల్లులోని కనకదుర్గ రైస్‌మిల్లు నిర్వాహకులు ఇప్పటివరకు పంపించిన వరిధాన్యంలో చెత్త, తాలు శాతం అధికంగా ఉందని తిరస్కరిస్తున్నారన్నారు. రైతులు ధాన్యంలో చెత్త, తాలు లేకుండా తేమ 17శాతం లోపు ఉండేటట్లుగా చూసుకుని వ్యవసాయ శాఖ అధికారుల ధృవీకరణ పత్రంతో కొనుగోలు కేంద్రానికి ధాన్యాన్ని తీసుకురావాలని సూచించారు.

'రేవంత్‌రెడ్డి క్షమాపణ చెప్పాలి'

హస్తినాపురం: యాదవులను, యాదవజాతిని కించపరిచేలా వ్యాఖ్యలు చేసిన పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి యాదవ్‌జాతికి, మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్‌కు క్షమాపణ చెప్పాలని జాతీయ యాదవహక్కుల పోరాటసమితి ప్రధాన కార్యదర్శి నారగోని శ్రీనివాస్‌యాదవ్ డిమాండ్ చేశారు. లేకుంటే గాంధీ భవన్‌ను ముట్టడిస్తామని ఆయన హెచ్చరించారు. గురువారం నగరంలోని ఇందిరాపార్కు వద్ద నిర్వహించే ధర్నాకు తరలివెళ్తూ హస్తినాపురంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. యాదవ్‌జాతిని కించపరిచే హక్కు రేవంత్‌రెడ్డికి ఎవరిచ్చారని, ఇతర కులాలను కించపరిచే రేవంత్‌రెడ్డికి తెలంగాణలోని యాదవులందరూ తగిన విధంగా బుద్ధిచెప్పి తీరాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. తెలంగాణలోని యాదవజాతికి భేషరతుగా క్షమాపణ చెప్పకపోతే రేవంత్‌రెడ్డిని అడుగడుగునా అడ్డుకుంటమాని శ్రీనివాస్‌యాదవ్ హెచ్చరించారు. కార్యక్రమంలో సాయియాదవ్, యాదవ ప్రతినిధులు పాల్గొన్నారు.

వీఓఏలపై వివక్ష చూపుతున్నారు



ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న వీఓఏలు

సీఐటీయూ మండల కన్వీనర్ బాల్‌రాజు

కందుకూరు: వీఓఏల పట్ల తెలంగాణ ప్రభుత్వం వివక్ష చూపుతోందని సీఐటీయూ మండల కన్వీనర్ బాల్‌రాజు విమర్శించారు. సమస్యల పరిష్కారం కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో వీఓఏలు చేపట్టిన సమ్మె గురువారానికి 39వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా బాల్‌రాజ్ మాట్లాడుతూ.. ధనిక రాష్ట్రం అని చెప్పుకునే తెలంగాణలో వీఓఏల కేవలం రూ.3900 వేతనం మాత్రమే చెల్లిస్తున్నారని, అదే పక్క రాష్ట్రంలో జగన్ సర్కార్ రూ.10వేలు చెల్లిస్తున్నారన్నారు. మహిళా సంఘాల బలోపేతానికి వీఓఏలు ఎంతో కృషి చేస్తున్నారన్నారు. ప్రభుత్వం స్పందించి డిమాండ్లనెరవేర్చాలన్నారు. ఈ కార్యక్రమంలో వీఓఏలు కవిత, పుష్పమ్మ, రజని, పద్మ, రమ్య, ఉమ, మంజుల, మాధవి, జ్యోతి, సంధ్య, సంతోష తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను పరామర్శించిన ఎర్రబెల్లి



పద్మమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి ఎర్రబెల్లి

ఇబ్రహీంపట్నం రూరల్: ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి మాతృమూర్తి మరణం ఆ కుటుంబానికి తీరని లోటని మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. ఇటీవల ఎమ్మెల్యే మాతృమూర్తి చనిపోయిన విషయం తెలుసుకున్న మంత్రి గురువారం మండలంలోని ఎలిమినేడు గ్రామానికి వచ్చి పద్మమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యే కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతరం మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్ ఎమ్మెల్యేను పరామర్శించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు మంచిరెడ్డి ప్రశాంత్ కుమార్‌రెడ్డి, ఎంపీపీ కృపేష్, వైస్ ఎంపీపీ మంచిరెడ్డి వెంకట ప్రతాప్‌రెడ్డి, సర్పంచ్ ఏ అశోకవర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రమాద బాధితులను ఆదుకోవాలి

సీపీఎం జిల్లా కార్యదర్శి భాస్కర్

యాచారం: పనులకు వెళుతూ ఔటర్ రింగ్ రోడ్డుపై ప్రమాదానికి గురైన బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి కే భాస్కర్ డిమాండ్ చేశారు. ప్రమాదంలో గాయపడి నగరంలోని ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారిని గురువారం ఆయన పరామర్శించారు. ప్రమాద వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఔటర్ రింగ్ రోడ్డుపై మొక్కల పెంపకం చేపట్టే కార్మికులంతా పేదవారేనని అన్నారు. క్షతగాత్రులకు ప్రభుత్వం తక్షణ వైద్య ఖర్చుల నిమిత్తం రూ. లక్ష చొప్పున ఆర్థిక సాయం చేయాలని కోరారు. వారు పూర్తిగా కోలుకునే వారకు ఆరు నెలల పాటు వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం యాచారం మండల కార్యదర్శి ఏ నర్సింహ, కొత్తపల్లి ఉప సర్పంచ్ జగన్ తదితరులు పాల్గొన్నారు.

కంకర పరిచి.. బీటీ మరిచి

- అసంపూర్తిగా రావిచేడ్ -మద్దెలకుంట తండా రోడ్డు పనులు
- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు
- పట్టించుకోని అధికారులు



కంకర వేసి వదిలేసిన రావిచేడ్ - మద్దెలకుంట తండా రోడ్డు

కడ్తాల్: మండలంలోని రావిచేడ్ - మద్దెలకుంట తండా రహదారి నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. కంకర పరిచి ఆరు నెలలు దాటినా బీటీ వేయకపోవడంతో వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎస్‌డీఎఫ్ కింద రెండు న్నరేళ్ల క్రితం ఈ రోడ్డు నిర్మాణానికి ప్రభుత్వం 2.20కోట్లు మంజూరు చేసింది. ఏడాది క్రితం పనులు ప్రారంభమయ్యాయి. తొలుత కల్వర్టుల నిర్మాణం పూర్తి చేశారు. ఆ తర్వాత కంకర వేసి వదిలేయడంతో వాహనచోదకులు ఇబ్బందులు పడుతున్నారు. తరచూ ప్రమాదాల బారిన పడుతున్నారు. మట్టి రోడ్డు ఉన్నా ఇబ్బందులు పడే వాళ్లం కాదని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు.

పలుమార్లు ఆందోళనలు..

అసంపూర్తిగా ఉన్న రావిచేడ్ - మద్దెలకుంట తండా రోడ్డును పూర్తి చేయాలంటూ తండా వాసులు అనేక సార్లు ఆందోళనలు చేపట్టారు. అధికారులు, ప్రజాప్రతినిధులకు వినతిపత్రాలు అందజేశారు. అదిగో పూర్తి చేస్తాం.. ఇదిగో పూర్తి చేస్తామని హామీలు ఇచ్చారే తప్ప పనులు పూర్తి చేయలేదని పలువురు ఆరోపిస్తున్నారు. ఈ రోడ్డు అందుబాటులోకి వస్తే బస్సు సౌకర్యం తోపాటు, మండల కేంద్రం కడ్తాల్‌తో పాటు, హైదరాబాద్‌కు రాకపోకలు సాగించేందుకు ఇక్కట్లు తొలగుతాయని తండా వాసులు ఆశగా ఎదురు చూస్తున్నారు. గర్భిణులను ఆస్పత్రులకు తీసుకెళ్లాలన్నా ఇబ్బందే.అధికారులు, ప్రజాప్రతినిధులు రోడ్డు పనులు సత్వరం పూర్తి చేయాలని పలువురు కోరుతున్నారు.


ప్రమాదాలు జరుగుతున్నాయి



రావిచేడ్ – మద్దెలకుంట మార్గంలో కంకర వేసి వదిలేయడంతో రాకపోకలు సాగించాలంటే భయమేస్తోంది. కంకర కారణంగా తరచూ ప్రమాదాల బారిన పడుతున్నాం. ప్రజాప్రతినిధులు స్పందించి త్వరితగతిన రోడ్డు పనులు పూర్తిచేయాలి.

– శ్రీనునాయక్, మద్దెలకుంట తండా

రాకపోకలకు ఇబ్బందిగా ఉంది



నత్తనడకన సాగుతున్న రోడ్డు పనులను త్వరగా పూర్తి చేయాలి. ఈ రోడ్డు అందుబాటులోకి వస్తే కడ్తాల్ తోపాటు హైదరాబాద్‌కు రాకపోకలు సాగించడానికి ఎంతో సులువుగా ఉంటుంది. ప్రజల రవాణా కష్టాలను దృష్టిలో పెట్టుకొని వెంటనే పనులు పూర్తిచేయాలి.

– జవర్య నాయక్, మద్దెలకుంట తండా

త్వరలో పూర్తిచేస్తాం



పదిహేను రోజుల్లో రావిచేడ్ - మద్దెలకుంట రోడ్డు పనులు పూర్తి చేస్తాం. ఇప్పటికే సంబంధిత కాంట్రాక్టర్‌తో మాట్లాడాం. వెంటనే పనులు పూర్తి చేయాలని ఆదేశించాం. పనులు జాప్యం కావడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్న మాట వాస్తవమే. అతి త్వరలో ప్రజలకు రవాణా కష్టాలు ఉండవు.

– పరమేశ్, పీఆర్ఏఈ, కడ్తాల్